క్లుప్తంగా

'నన్నయ' సిబ్బందికి క్రీడా పోటీలు



వాలీబాల్ ఆడుతూ పోటీలను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని యూనివర్సిటీ క్రీడా మైదానంలో బోధన, బోధనేతర సిబ్బందికి గురువారం క్రీడా పోటీలు నిర్వహించారు. వాలీబాల్, క్యారమ్స్ ఆడి ఈ పోటీలను వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ప్రారంభించారు. పురుషులకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, 800 మీటర్ల వాకింగ్, షాట్ పుట్, క్యారమ్స్, మహిళలకు 400 మీటర్ల రన్నింగ్, షాట్‌పుట్, క్యారమ్స్, త్రోబాల్, బ్యాడ్మింటన్, మ్యూజికల్ చైర్ పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు ఈ నెల 22న జరిగే యూనివర్సిటీ ఆవిర్భావ దినోత్సవంలో బహుమతులు అందజేస్తామన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ పనులకు శ్రీకారం



నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గురువారం కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ స్టాఆచార్య జి.సుధాకర్, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, ఎంపీడీఓ జేపీ ఝాన్సీ, విద్యుత్ శాఖ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



దొడ్డిగుంటలో నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సిబ్బంది

రంగంపేట: దొడ్డిగుంట గ్రామంలోని సారా స్థావరాలపై గురువారం దాడి చేసినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన టేకుమూడి దుర్గారావు నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



జి.మామిడాడలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి: నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. జి.మామిడాడ, పెద్దాడ, పెదపూడి గ్రామాల్లో 13 సీసీ రోడ్ల నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామ సర్పంచులు లంక మున్ని, దొంకుబుర్ర మీనాక్షి, కలవల కృష్ణమూర్తి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, మాజీ ఎంపీపీ జుత్తక సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో మేజర్ సబ్జెక్టులపై స్పష్టత ఇవ్వండి

కంబాలచెరువు: రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల ప్రవేశాల విషయంలో ప్రభుత్వం నిర్ణయాలను వేగంగా తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కోరింది. డిగ్రీ స్థాయిలో ఒక మేజరా రెండు మేజర్లను ఉంచాలన్న విషయంపై ప్రభుత్వం ఒక కమిటీని వేసి, ఆ కమిటీ సమావేశం నిర్వహించి పది రోజులు కావస్తున్నా ఇంకా ఎటువంటి నిర్ణయాన్ని ప్రకటించక పోవడం దారుణమని నిరసన వ్యక్తం చేసింది. లలితానగర్‌లోని సంఘ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆ విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడారు. మేజర్ల విధి విధానాలపై కమిటీ నివేదికను వెంటనే బహిరంగ పర్చాలన్నారు. ఇన్ని రోజులుగా కమిటీ నివేదిక రాకపోవడానికి కారణం అధికారుల సమన్వయ లోపమేనని విద్యార్థి లోకం భావిస్తున్నారన్నారు. ఇంజినీరింగ్ అడ్మిషన్లతో ముడి పెట్టకుండా, డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలన్నారు.

గుడ్‌ఫ్రైడేకు సర్వం సిద్ధం

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- పూర్తయిన ఏర్పాట్లు
- తపస్సుకాల దీక్షల్లో క్రైస్తవులు



సీతానగరం మండలం కూనవరంలో మాలధారణ చేసిన యువత



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కోరుకొండ: గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవడానికి సర్వం సిద్ధమైంది. ఈ మేరకు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే క్రైస్తవులు ప్రారంభించిన 40 రోజుల ఉపవాస ప్రార్థనలు శనివారంతో ముగియనున్నాయి. గత నెల 5వ తేదీన మొదలైన తపస్సు కాలం దీక్షలను పూర్తి చేసుకున్న క్రైస్తవులు గురు, శుక్ర, శనివారాల్లో ప్రత్యేకారాధనలు చేస్తారు. దీనిలో భాగంగా కోరుకొండ ఎస్ఆర్ నగర్ చర్చిలో గురువారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. రెవరెండ్ ఫాదర్ మాణిక్యం వాక్య సందేశం అందించారు. మానవాళి పాపాల విముక్తి కోసం ఏసుక్రీస్తు చిత్రహింసలను అనుభవించి, శిలువపై మరణించి 3వ రోజు సమాధి నుంచి పునరుత్థానుడయ్యారన్నారు. క్రైస్తవులు క్షమాపణ గుణాన్ని కలిగి, సహోదర ప్రేమను సమాజానికి పంచాలన్నారు. ఏసుక్రీస్తును సైనికులకు అప్పగించబడటానికి గుర్తుగా గురువారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు శిష్యుల కాళ్లను కడిగి సంఘటనకు అనుగుణంగా ఫాదర్ మాణిక్యం 14 మంది శిష్యుల కాళ్లను కడిగారు.

ఉపవాస ప్రార్థనలు

క్రైస్తవులకు అత్యంత పవిత్రమైన గుడ్ ఫ్రైడేను శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఆచరించనున్నారు. ఈ మేరకు ఉదయం నుంచి ఉపవాసాలు ఉంటారు. ఏసుక్రీస్తు ఒలీవా కొండపై శిలువపై మరణించిన సందర్భాన్ని పురస్కరించుకుని బహిరంగ శిలువ యాత్ర ప్రదర్శన నిర్వహిస్తారు. సుమారు పది కిలో మీటర్లు ప్రార్థనలు చేసుకుంటూ నడుస్తారు.


శనివారం జాగరణ

క్రీస్తు శిలువపై మరణించి, సమాధిలో భద్రపర్చిన సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి జాగరణ ప్రార్థనలు చేస్తారు. ఆదివారం తెల్లవారుజామున క్రీస్తు సమాధి నుంచి సజీవంగా లేవబడతారన్న నమ్మకంతో రాత్రంతా జగరణ ప్రార్థనలు చేస్తారు.

ఆదివారం ఈస్టర్

ఏసుక్రీస్తు సమాధి నుంచి లేచిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం ఈస్టర్ పండగ జరుపుకొంటారు. దీంతో 40 రోజుల దీక్షలు సంపూర్ణమవుతాయి. జిల్లాలో ఆర్‌సీఎం, లూథరన్, పెంతెకోస్తు, బైబిల్ మిషన్ తదితర సుమారు 500 చర్చిలున్నాయి. తపస్సు కాలం ఉపవాస దీక్షలు చేపట్టిన వారందరూ శుక్రవారం సాయంత్రం మాలలను తొలగిస్తారు.

ఘనంగా వేల్పులమ్మ తీర్థం



చంద్రేడులో కొలువైన వేల్పులమ్మ

రంగంపేట: చంద్రేడు గ్రామంలో కొలువైన వేల్పులమ్మ వార్షిక తీర్థం గురువారం ఘనంగా జరిగింది. ఈ మేరకు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు విశేష ఏర్పాట్లు చేశారు. ఉదయం అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి స్వరూపాలైన గరగలను గ్రామంలో ఇంటింటికీ ఊరేగించారు. కోలాటం, కోయనత్యం, బాణసంచా కాల్పులతో తీర్థం అంగరంగ వైభవంగా జరిగింది.

అన్న సమారాధన

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం పంచాయతీ పరిధిలోని లంకూరు కోదండ రామాలయం వద్ద గురువారం అన్నసమారాధన నిర్వహించారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ నిర్వహించారు. సుమారు 3,500 మంది భక్తులు తరలి వచ్చి, అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సత్యనారాయణరెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: అనపర్తి మండలం రామవరంలో గుడిమెట్ల సత్యనారాయణరెడ్డి కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గం కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గురువారం పరామర్శించారు. సత్యనారాయణరెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే ముందుగా సత్యనారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ నాయకులు కర్రి గాంధీరెడ్డి, నల్లమిల్లి ఆదినారాయణరెడ్డి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సీహెచ్‌వోల నిరసన



సీతానగరంలో నిరసన తెలుపుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

పెదపూడి: ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (విలేజ్ క్లినిక్స్)లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో)లు తమ సమస్యల కోసం గురువారం సంపర పీహెచ్‌సీ వద్ద శాంతియుత నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ గైడ్ లైన్స్ ప్రకారం ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని రెగ్యులర్ చేయాలన్నారు. తమకు రావాల్సిన ప్రోత్సాహకాలు వెంటనే చెల్లించాలన్నారు. ఈపీఎఫ్‌వోను పునరుద్ధరించాలని, ఎన్‌హెచ్‌ఎం ప్రకారం 23 శాతం హైక్ ఇవ్వాలని, దూర ప్రాంతాల్లో ఉన్న సీహెచ్‌ఓలకు ట్రాన్స్‌ఫర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనతో ప్రజల వైద్య సేవలకు ఎలాంటి ఆటంకం కలగలేదని తెలిపారు.



సంపర పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న సీహెచ్‌వోలు

సీతానగరంలో..

సీతానగరం: స్థానిక పీహెచ్‌సీ వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు నిరసన తెలిపారు. తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని నినాదాలు చేశారు. అనంతర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ఏవీకే చైతన్యకు అందజేశారు. నిరసనలో సీహెచ్‌వో ఎస్కే మౌనిక, బి.చంద్రశేఖర్, ఎస్కే చాంద్‌బీ, బి.,స్వరూప, స్పందన, నాగశ్వేత, అరుణ, ప్రశాంతి, చిన్నారి, స్వప్న పాల్గొన్నారు

ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలి



రంగంపేట కార్యాలయంలో విచారణ జరుపుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

రంగంపేట: సమాచార హక్కుచట్టం 2005 ప్రకారం అర్జీలకు నిర్ణీత వ్యవధిలో సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించిన పౌర సమాచార అధికారులపై చర్యలు తీసుకోవాలని ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యంకి సురేష్ బాబు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమావేశమై మాట్లాడారు. వడిశలేరులోని మండల పరిషత్ ప్రాథమిక ప్రత్యేక పాఠశాల, సూర్యనారాయణపురం ప్రాథమిక పాఠశాలలకు సంబంధించిన సమాచారం ఇవ్వాలని దరఖాస్తు చేయడం జరిగిందన్నారు. అయితే ఆ పాఠశాలల ఉపాధ్యాయులు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. దీనిపై మొదటి అప్పీలు ఎంఈఓకు దాఖలు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అప్పిలేట్ అధికారి అయిన ఎంఈఓ కె. శ్రీనివాసరావు విచారణకు పిలిచినట్టు తెలిపారు. చట్టాన్ని నిర్లక్ష్యపరచి దరఖాస్తుదారులకు సమాచారం ఇవ్వకుండా సమయాన్ని వృథా చేసినందుకు గాను సీసీఏ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని అప్పిలేట్ అధికారులను కోరామన్నారు. ఎంఈఓ కె.శ్రీనివాసరావు సమాచార హక్కు చట్టం అప్పిలేట్ అధికారిగా విచారణ చేశారని, అనంతరం ఈ నెల 30వ తేదీలోపు పూర్తి సమాచారం గల నకలు కాపీలన్నీ చట్టంలోని నిబంధనల మేరకు ఉచితంగా సంబంధిత అర్జీదారులకు ఇవ్వాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర రీజియన్ చైర్మన్ కోడి కిషోర్, ఎంఈఓ–2 పి.మధుసూదనరావు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర గ్రామాల ఏర్పాటుకు కృషి



పెదపూడిలో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: ఆరోగ్యవంతమైన గ్రామాల ఏర్పాటుకు అందరూ కృషి చేయాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి పంచాయతీ వద్ద గురువారం నిర్వహించిన గ్రామ సభకు ప్రత్యేక అధికారిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం ప్రతినెలా మూడో శనివారం ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రపర్చుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ వేస్ట్‌ను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి చేర్చాలన్నారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి జి.ఉషారాణి, ఉప సర్పంచ్ పెద్ద సత్యరాజు, సాగునీటి సంఘం అధ్యక్షుడు ఆరుమిల్లి వాసు, ఐసీడీఎస్ పెదపూడి సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీగౌరీ తదితరులు పాల్గొన్నారు. కుమారప్రియంలో జరిగిన గ్రామ సభలో సర్పంచ్ బిరద వీర వెంకట సత్యనారాయణ, సచివాలయం కార్యదర్శి సుంకర వీరస్వామి నాయుడు, నాయకులు చోడిశెట్టి ఫణీంద్ర, బిరద రామకృష్ణ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



కాపవరంలో బాధితులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కోరుకొండ: కాపవరంలోని రైస్‌మిల్లులో పనిచేస్తూ ఇటీవల ముగ్గురు జట్టు కూలీలు మృతి చెందిన విషయం తెలిసిందే. వారి కుటుంబాలను బీజేపీ నాయకుడు, విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా సహాయాన్ని త్వరగా అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట పచారి నరసింహారావు, బత్తిన వీరాంజనేయులు, పసల గణేష్ తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ శాంతిరత్నకుమారి

బిక్కవోలు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ శాంతిరత్నకుమారి అన్నారు. పోషణ్ పక్వాడ పక్షోత్సవాల్లో భాగంగా పందలపాకలోని పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాంతిరత్నకుమారి మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. గుడ్ టచ్, బాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు మానహారం, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలోని అంగన్ కార్యకర్తలు బండారు శాంతి, తుమ్మూరి సుజాత, చెల్లె పెద్దక్క, గంగులూరి వెంకటలక్ష్మి, డి.మణి, డి.రాణి, వీఎస్ వెంకటలక్ష్మి, కె.శైలజ, పాఠశాల హెచ్ఎం చిర్ల శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు కాపునాడు ప్రోత్సాహం




విద్యార్థినులకు నగదు బహుమతులు అందజేస్తున్న కాపునాడు సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు కాపునాడు ప్రోత్సాహం అందిస్తుందని కాపునాడు ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు గుదే రఘు నరేష్ అన్నారు. దేవీచౌక్‌లోని కాపునాడు కార్యాలయంలో గురువారం రాజమహేంద్రవరం కాపునాడు కార్యవర్గం తరఫున బహుమతులు అందించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని విన్నా మీనాక్షి (988 మార్కులు), మొదటి సంవత్సరం విద్యార్థిని పిడుగు జ్యోతిప్రియ (470 మార్కులు)లను అభినందిస్తూ నగదుతో పాటు బహుమతులను నగర కాపునాడు గౌరవ అధ్యక్షుడు ఆకుల వెంకటేశ్వరరావు సౌజన్యంతో అందజేశారు. బ్యాగులు, డిక్షనరీలను కార్యవర్గ సభ్యులు బహూకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థినులు భవిష్యత్తులో మరింత బాగా చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని, అందరికీ ఆదర్శంగా నిలవాలని కోరారు. పార్లమెంట్ అధ్యక్షుడు ముమ్మిడి వీరబాబు, విన్నా వాసు, దేశిసీడి రాంబాబు పాల్గొన్నారు.

సక్రమంగా వైద్యసేవలు

సీతానగరం: వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సక్రమమైన రీతిలో వైద్యసేవలు అందిస్తున్నామని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు గురువారం ప్రకటనలో తెలిపారు. 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'వైద్యానికి వైరస్' అనే కథనానికి ఆయన స్పందించారు. వెంటనే సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ఏవీకే చైతన్యను వివరణ కోరారు. సీతానగరం మండలంలో రెండు 104 వాహనాలు ఉన్నాయని, మందులన్నీ సరిపడా అందుబాటులో ఉన్నాయని డాక్టర్ చైతన్య తెలిపారు. ఎఫ్‌పీసీ ప్రోగ్రామ్ ద్వారా ప్రతి రోజు ఓపీలో సుమారు వంద మంది రోగులకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అదే రోజు అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలను, స్కూల్ పిల్లలను విజిట్ చేసి పరీక్షిస్తున్నామన్నారు. స్పెషలిస్ట్ డాక్టర్ల సర్వీస్ అవసరమైన వారికి టెలికన్సల్టెన్సీ ద్వారా సలహాలు వైద్య అందిస్తున్నామన్నారు.

సారా బట్టీలపై విస్తృత దాడులు



స్వాధీనం చేసుకున్న డ్రమ్ములతో అసిస్టెంట్ కమిషనర్ శివప్రసాద్, ఈఎస్ లావణ్య తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమిషనర్ శివప్రసాద్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ సీహెచ్ లావణ్య ఆధ్వర్యంలో గురువారం ఎక్సైజ్ సౌత్‌స్టేషన్ పరిధిలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. రాజానగరం మండలం రఘునాథపురం, నామవరం, రూరల్ మండలం శాటిలైట్ సిటీ గ్రామాల్లో ఇవి జరిగాయి. ఈ సందర్భంగా 8 వేల లీటర్ల పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేసి, 35 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీదారులైన లంజపల్లి శ్రీను, పసల సత్తిబాబు, గోనబోయిన నారాయణమూర్తి, రేలంగి శ్రీను, వెలుగంటి గంగరాజుపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఏఈఎస్‌లు నాగ రాహుల్, వినీషా తదితరులు పాల్గొన్నారు. కాగా.. సారా తయారీ కేంద్రాల ఆచూకీ తెలిసిన వారు 94409 02411 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఏసీ శివ ప్రసాద్, జిల్లా ఆఫీసర్ సీహెచ్ లావణ్య తెలిపారు. చెప్పిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

వేసవి కాలం.. అగ్నితో జరభద్రం

- ప్రమాదాలకు ఎక్కువ అవకాశం
- గ్యాస్ సిలిండర్లతో జాగ్రత్త అవసరం
- నిర్లక్ష్యం వహిస్తే ముప్పు తప్పదు
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



అగ్నిప్రమాదాలపై అనపర్తిలో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది



సిలిండర్ నుంచి నిప్పు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న సిబ్బంది

బిక్కవోలు: కట్టెల పొయ్యికి కాలం చెల్లింది. ఇప్పుడు ఏ ఇంట్లో చూసినా గ్యాస్ స్టవ్ దర్శనమిస్తోంది. వీటి వినియోగంపై అవగాహన లేక కొందరు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే ఎండాకాలం అధిక ఉష్ణోగ్రతలతో ఏదో ఒక చోట అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. విద్యుదాఘాతం, సిగరెట్, చుట్ట, బీడీ ఆర్పివేయకుండా పడేయడంతో ప్రమాదాలు జరుగుతుంటాయి. ప్రకృతి వైపరీత్యాలతో జరిగే ప్రమాదాలను పక్కన పెడితే మానవ తప్పిదాలతో సంభవించే ప్రమాదాలే అధికమని అగ్నిమాపకశాఖ అధికారులు చెబుతున్నారు. తగిన జాగ్రత్తలతో వీటిని అరికట్టవచ్చన్నారు.

గత ఆరేళ్లలో..

అనపర్తి ఫైర్ స్టేషన్ పరిధిలో గత ఆరేళ్లలో 335 అగ్ని ప్రమాదాలు జరిగాయి. సుమారు రూ.19,88,78,468 నష్టం జరిగిందని అధికారులు చెబుతున్నారు. ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా కొంత వరకు ప్రమాదాలు నివారించడం సాధ్యమన్నారు. ముఖ్యంగా ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి ఫోన్ చేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించే వీలుంటుంది. 1944 ఏప్రిల్ 14న బొంబాయి ఓడరేవులో ఆయుధాలు, గన్ పౌడర్ కలిగిన నౌకలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 336 మంది ప్రజలు, 66 మంది అగ్నిమాపక సిబ్బంది మృతి చెందారు. వారి సంస్మరణార్థం ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు జరుపుకొంటున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి

- వంట గ్యాస్ వాడిన తర్వాత రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలి.
- బయట నుంచి ఇంట్లోకి వచ్చినప్పుడు గ్యాస్ వాసన వస్తే లైట్లు, ఫ్యాన్ వంటివి వేయకుండా వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. సిగరెట్, చుట్ట, బీడీ కాల్చినప్పుడు, వాటిని ఆర్పి పాడేయ్యాలి.
- ఇళ్లను వదలి వెళ్లేవారు విద్యుత్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి. ఇలా చేయడం వల్ల వేడికి షార్ట్ సర్క్యూట్ అయినా విద్యుత్ ఇంట్లోకి ప్రవేశించకుండా ఉంటుంది.
- వంట చేసే మహిళలు కాటన్ దుస్తులను ధరించాలి. అగ్గిపెట్టెలు, లైటర్లు, దీపాల నుంచి చిన్నారులను దూరంగా ఉంచాలి.
- సిలిండర్‌ను ఎప్పుడూ నిలువుగానే ఉంచాలి. సిలిండర్ కంటే స్టవ్ ఎత్తులో ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.

అవగాహన కల్పిస్తున్నాం



అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం, గ్యాస్ లీకైనప్పుడు మంటలను ఎలా ఆర్పివేయాలో ప్రయోగాత్మకంగా చూపిస్తున్నాం. ప్రమాదాల నుంచి కాపాడుకునే మెలకువలు నేర్పిస్తున్నాం. దీంతో ప్రమాదాలను చాలా వరకు తగ్గించగలుగుతున్నాం. నాలుగేళ్లలో సుమారు రూ.35 కోట్లు విలువైన ఆస్తిని కాపాడాం. ప్రమాదాలు సంభవించిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలి.

– జె.శ్రీనివాస్‌రెడ్డి, అగ్నిమాపక అధికారి, అనపర్తి